ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యాన్ని సాధిస్తాం

చెల్లింపునకు పది రోజుల్లో ముగియనున్న గడువు

- ఇప్పటి వరకు రూ. 224.74 కోట్ల వసూలు
- మరో రూ. 32.82 కోట్ల వసూలుకు చర్యలు
- ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ

ఎల్‌బీనగర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో పది రోజుల్లో ముగియనున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయ పరిధిలో ఆస్తి పన్ను వసూలు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. జోనల్ పరిధిలో ఆస్తి పన్ను చెల్లింపు గడువు ఈ నెల 31తో ముగియనుంది. తమకు కేటాయించిన ఆస్తి పన్ను వసూళ్ల టార్గెట్‌ను చేరుకునేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది ఉరుకులు పరుగులు పెడుతున్నారు. గతేడాదిలానే ఈ సంవత్సరం కూడా వసూళ్లను రెట్టింపు చేసేందుకు అధికారులు కుస్తీ పడుతున్నారు. మరో పది రోజుల్లో రూ. 32.89 కోట్ల మేర ఆస్తి పన్ను వసూలు చేస్తే ఈ ఆర్థిక సంవత్సరం అనుకున్న లక్ష్యాలను పూర్తి చేసినట్లేనని అధికారులు పేర్కొంటున్నారు.

- ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో ఇప్పటికి సుమారు రూ. 224.74 కోట్ల మేర పన్ను వసూలు చేశారు. గత సంవత్సరంలో గ్రేటర్‌లోని అన్ని జోన్లలో ఎల్‌బీనగర్ జోన్ ఆస్తి పన్ను వసూళ్లలో మొదటి స్థానం సాధించినట్లు చెబుతున్నారు. అలాగే ఈ సంవత్సరం కూడా అగ్రస్థానంలో నిలిచేందుకు ప్రయత్నిస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ వెల్లడించారు.

సర్కిళ్ల వారీగా వసూలిలా...

- ఎల్‌బీనగర్ జోనల్‌లోని ఐదు సర్కిళ్ల పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరం రూ. 262 కోట్ల వసూలే లక్ష్యం కాగా ఇప్పటి వరకు సుమారు రూ. 224.74 కోట్లు వసూలు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.
- ఇక ఆస్తి పన్నులు చెల్లించే గడువు ఈ నెల 31న ముగిస్తుంది. చివరి రోజు వరకు ఇచ్చిన టార్గెట్‌ను చేరుకుంటామని ధీమాలో అధికారులు ఉన్నారు.



జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయం

- కాప్రా సర్కిల్‌లో రూ. 52 కోట్ల టార్గెట్ ఉండగా ఇప్పటి వరకు సుమారు రూ. 47.93 కోట్లు వసూలు చేశారు. మిగిలిన రూ. 3.31 కోట్ల పన్ను బకాయిదారుల నుంచి రాబట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.
- ఉప్పల్ సర్కిల్‌లో రూ. 37 కోట్లు లక్ష్యం కాగా ఇప్పటి వరకు సుమారు రూ. 29.02 కోట్ల మేరకు ఆస్తి పన్ను వసూలైంది. మిగిలిన రూ. 7.98 కోట్ల పన్నును పూర్తిస్థాయిలో వసూలు చేసేందుకు అధికారులు ముమ్మరంగా కృషి చేస్తున్నారు.
- ఎల్‌బీనగర్ సర్కిల్–3లో రూ. 62 కోట్ల లక్ష్యానికిగాను ఇప్పటి వరకు రూ. 52.80 కోట్లు వసూలు చేశారు. రూ. 9.20 కోట్ల బకాయిలను వసూలు చేసేందుకు సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేశారు.
- ఎల్‌బీనగర్ సర్కిల్–4లో రూ. 49 కోట్ల టార్గెట్ ఉండగా ఇప్పటి వరకు రూ. 45.18 కోట్లు వసూలైంది. మరో రూ. 3.82 కోట్లను రాబట్టేందుకు అధికారులు వాట్సాప్ మేసేజ్‌లు, ఇంటింటికీ తిరుగుతూ ఎలాగైనా లక్ష్యాన్ని సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.
- ఎల్‌బీనగర్ సర్కిల్–5లో రూ. 62 కోట్ల లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ. 49.80 కోట్లు వసూలైంది. మిగిలిన రూ. 12.20 కోట్లను వసూలు చేసి తమ టార్గెట్‌ను పూర్తి చేయాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.
- ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలోని ఐదు సర్కిళ్ల పరిధిలో సుమారు రూ. 37.26 కోట్లు వసూలు చేస్తే ఈ సంవత్సరం టార్గెట్ పూర్తి అయినట్లే అని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇచ్చిన ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యాన్ని చేరుకునేందుకు తమ వంతు కృషి చేస్తున్నాము. ఇందుకు గాను ఐదు సర్కిళ్ల డీసీలు, రెవిన్యూ విభాగం అధికారులు, సిబ్బంది కూడా ఇచ్చిన టార్గెట్లను పూర్తి చేసేందుకు ముమ్మరంగా కృషి చేస్తున్నారు. మరో 10 రోజుల గడువు మాత్రమే మిగిలి ఉన్నందున బకాయిదారులు వెంటనే మీ సేవా కేంద్రాలు, టాక్స్ వసూళ్ల కేంద్రాలు, సిటిజన్ సర్వీస్ సెంటర్లలో చెల్లించాలి. పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి.

\- పంకజ, జోనల్ కమిషనర్



హలీం తయారీదారులకు అవగాహన

చైతన్యపురి: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని హలీం తయారు చేసే వారి కోసం సోమవారం జీహెచ్‌ఎంసీ ఈస్ట్ జోనల్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ పంకజ హలీం తయారుదారులకు పలు సూచనలు చేశారు. హలీం బట్టీని భవనం పై అంతస్థులో పెట్టరాదని సూచించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలుగకుండా సురక్షితమైన ప్రదేశంలో హలీం తయారీ బట్టీని ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చూశారు. స్వచ్ఛమైన పదార్థాలు వాడాలని, జీహెచ్‌ఎంసీ వధశాలలో డాక్టర్లు సర్టిఫై చేసిన మాంసాన్ని మాత్రమే వినియోగించాలని ఆమె వెల్లడించారు. హలీం బట్టీ దగ్గర అగ్ని మాపక నివారణ చర్యలు చేపట్టాలని, వ్యర్థాలను స్వచ్ఛ ఆటోలను వాడి పరిసరాలు శుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. ముందు రోజు మిగిలిపోయిన పదార్థాలు మరుసటి రోజు వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీడీ డాక్టర్ డి.రజిత, ఐదు సర్కిళ్ల టౌన్ ప్లానింగ్, మెడికల్, వెటర్నరీ, శానిటేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి



పూజలు చేస్తున్న కార్పొరేటర్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ఉన్న పురాతన ఆలయాలను అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు తన కృషి చేస్తానని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. అగ్రికల్చర్ కాలనీలోని పురాతన రామాలయంలో విగ్రహాలను కాలనీవాసులు పునః ప్రతిష్ఠచే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ సుజాతానాయక్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సహకారంతో చాలా ప్రాంతాల్లోని దేవాలయాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అగ్రికల్చర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మణిపాల్ రెడ్డి, కాలనీ నేతలు మేఘారెడ్డి, బాలకృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, శర్మ, భారతీయ రాష్ట్ర సమితి నాయకులు గోపీరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కల్యాణ్, శశి, రోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి అవార్డు గ్రహీతకు చేయూత

హయత్‌నగర్: అంగవైకల్యాన్ని జయించి సామాజిక సేవ, కళలు, మహిళా సాధికారిత రంగాలలో మూడు సార్లు రాష్ట్రపతి అవార్డును దక్కించుకున్న డాక్టర్ పి.పద్మావతికి ఉప్పల ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా సోమవారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ మునుగనూరులోని ఆమె నివాసంలో కలిసి రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఖమ్మంకు చెందిన పద్మావతి చిన్నతనంలోనే పోలియోతో రెండు కాళ్లు చచ్చుబడి పోయినా ఆత్మవిశ్వాసం వీడకుండా పట్టుదలతో చదువుకుని వివధ కళల్లో రాణించారని, వైకల్యాన్ని జయించిన ఆమె ఒక వైపు సామాజిక సేవలు చేస్తూనే మహిళా సాధికారిత కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. కళారంగంలో ఆమె ప్రతిభకు గుర్తింపుగా 2009లో మొదటి సారి రాష్ట్రపతి అవార్డును పొందారని, 2011లో స్త్రీ శక్తి విభాగంలో రాష్ట్రపతి అవార్డును దక్కించుకోగా 2022లో మరోసారి రాష్ట్రపతి అవార్డు ఆమెను వరించిందని తెలిపారు. ముగ్గురు రాష్ట్రపతుల చేతుల మీదుగా మూడుసార్లు రాష్ట్రపతి పురస్కారం పొందిన పద్మావతి దేశంలోనే అరుదైన ఘనత సాధించారన్నారు.




పద్మావతికి సాయాన్ని అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

'ఆయుష్మాన్ భారత్' పేదలకు వరం

నాగోలు: ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేకు ఓ వరంలా ఉపకరిస్తుందని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ అన్నారు. నాగోలు గ్రామంలోని అంబేద్కర్ యువజన సంఘంలో ప్రధానమంత్రి ఆరోగ్య యోజన లబ్ధిదారుల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పించటం అఖండ భారతావనిలో అతిపెద్ద ఆరోగ్య పథకం అన్నారు. దీని కోసం ఏటా కేంద్ర ప్రభుత్వం రూ. 8,800 కోట్లకుపైగా కేటాయిస్తుందన్నారు. నాగోలు డివిజన్‌లోని పేద, మధ్య తరగతి, వేతన జీవులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీజేపీ నాగోలు డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, నేతలు దప్పు రాజు, రావుల శ్రీనివాస్, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేస్తే 'ఆరోగ్య సమాజం'

- సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడొచ్చు
- ప్రమాదాల్లో తలకు తగిలే గాయాలపై అవగాహన
- సీపీఆర్ ఇతర జాగ్రత్తలపై శిక్షణ
- రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్



మాట్లాడుతున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

మన్సూరాబాద్: పోలీసులు, డాక్టర్లు కలిసి పనిచేస్తే సమాజం ఆరోగ్యంగా, భద్రంగా ఉంటుందని రాచకొండ పోలీస్ కమిషనర్ డి.ఎస్.చౌహాన్ పేర్కొన్నారు. ప్రపంచ హెడ్ ఇంజ్యూరీ అవగాహన డే సందర్భంగా ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్‌లోని ఇందిరా ఆడిటోరియంలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రమాదాల్లో తలకు తగిలే గాయాలపై పోలీసు సిబ్బందికి అవగాహన, అత్యవసర పరిస్థితిల్లో కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్)పై శిక్షణను ఇచ్చారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీపీ డీఎస్ చౌహాన్ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... సమాజంలో వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఒత్తిడిలో మునిగి ఆరోగ్యాన్ని చూసుకోవటం లేదన్నారు. ఎంత పెద్ద వ్యాధి అయినా ప్రాథమిక దశలో గుర్తిస్తే నియంత్రించవచ్చని స్పష్టం చేశారు. సీపీఆర్ చేయటం వచ్చుంటే ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. రోడ్డు ప్రమాదంలో తలకు గాయలైన మృతి చెందిన వారిలో ఎక్కువగా హెల్మెట్ ఉపయోగించలేదని స్పష్టం చేశారు. కామినేని హాస్పిటల్స్ సీఈఓ డాక్టర్ గాయత్రి మాట్లాడుతూ... దేశంలో ప్రతి 10 నిమిషాలకు తలకు బలమైన గాయంతో మరణం సంభవిస్తోందన్నారు. పోలీసు సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ ఇవ్వడంతో పాటు హెడ్ ఇంజూరీపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదం జరిగిన గంటలోపు సమీప ఆస్పత్రికి బాధితులను చేర్చాలని, గోల్డెన్ హవర్‌లో చేర్చడంతో ప్రాణాలను కాపాడవచ్చని స్పష్టం చేశారు. కామినేని హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ శశిధర్, ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, పోలీసు అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

భార్య రాలేదనే బాధతో యువకుడి ఆత్మహత్య

హస్తినాపురం: పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రాలేదని బాధతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం పట్టణానికి చెందిన రామాంజనేయులు (24) గత సంవత్సరం నగరానికి వచ్చి వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీఎన్‌రెడ్డినగర్‌లోని ప్రైవేటు హాస్టల్ వంట మనిషిగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. అదే హాస్టల్ పనిచేస్తున్న ముషీరాబాద్‌కు చెందిన జ్యోతిని ప్రేమించి మూడు నెలల క్రితం పెళ్లి చేసుకున్నాడు. ఇటీవలే తన భార్య పుట్టింటికి వెళ్లి తిరిగిరాక పోవడంతో మనస్తాపం చెందిన యువకుడు ఆదివారం సాయంత్రం గదిలోని గోడకు ఉన్న కొక్కానికి చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయండి: సీఐటీయూ

లింగోజిగూడ: అన్నదాతలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో రైతు సంఘాలు, సీఐటీయూ ఆధ్వర్యంలో ఏప్రిల్ 5వ తేదీన చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ పిలుపునిచ్చారు. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజవంతం చేయాలని ఎల్‌బీనగర్ లేబర్ అడ్డా వద్ద సోమవారం సీఐటీయూ నేతలు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ... బీజేపీ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. గడచిన తొమ్మిదేళ్లలో కేంద్ర ప్రభుత్వం రైతులు, కార్మికుల సంక్షేమం.. అభ్యున్నతి కోసం చేసిందేమీ లేదని ఆరోపించారు. రైతు రుణాలను పూర్తిస్థాయిలో మాఫీ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు ఆలేటి ఎల్లయ్య, రామస్వామి, లక్ష్మణ్, యాకయ్య, యాదయ్య, సుగుణ, అంజమ్మ, శ్రీనివాస్, జంగయ్య, బుచ్చమ్మ, మైసమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్వేత

సైదాబాద్: నిరుద్యోగ యువతను తెలంగాణ ప్రభుత్వం నిలువునా ముంచుతోందని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ వెంటనే తన మంత్రి పదివికి రాజీనామ చేయాలని ఆమె డియాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షల నిర్వాహణలో తెలంగాణ ప్రభుత్వం వైఫల్యం చెందిందని నిరసిస్తూ సోమవారం చంపాపేట ప్రధాన రహదారిపై ఉన్న సైదాబాద్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్, అజయ్‌రెడ్డి, ధీరజ్, శేఖర్ పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం: బీజేపీ




మలక్‌పేటలో ఆందోళన చేస్తున్న బీజేపీ నేతలు, కార్పొరేటర్లు

మలక్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్ రెడ్డి అన్నారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మూసారంబాగ్ డివిజన్ దిల్‌సుఖ్‌నగర్‌లో «మాకొలువులు మాగ్గావాలే» అనే నినాదంతో సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి, జిల్లాప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, కోశాధికారి రమేష్‌రెడ్డి, అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్, మలక్‌పేట కన్వీనర్ నవీన్‌రెడ్డి, సీనియర్ నేతలు రాంకోటేశ్వర్‌రావు, సుభాష్‌చందర్, యాదగిరిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... టీఎస్‌పీఎస్‌సీ అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, టీఎస్‌పీఎస్‌సీ అభ్యర్థులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయాల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అ'పూర్వ' సమ్మేళనం

మన్సూరాబాద్: లయోలా మోడల్ హైస్కూల్ వనస్థలిపురం (వైదేహీనగర్ బ్రాంచ్) పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం, సిల్వర్‌జూబ్లీ వేడుకలు మన్సూరాబాద్‌లోని ఎం గ్రాండ్ హోటల్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. 10వ తరగతి పూర్తయి 25 వసంతాలు (1997–98 బ్యాచ్) గడిచిన సందర్భంగా అలనాటి మిత్రులందరూ ఒక చోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను నేమరువేసుకుంటూ ప్రస్తుత తమ జీవన పరిస్థితులపై ఒకరికొకరితో పంచుకున్నారు. 25 సంవత్సరాల్లో వివిధ రంగాల్లో స్థిరపడ్డ వారు తమ అభివృద్ధిని, తమ పిల్లల అభివృద్ధిని పరిచయం చేసుకుని ఆట, పాటలతో సంతోషంగా గడిపారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట్‌రావు, ఉపాధ్యాయురాలు పద్మవతిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, సుబ్రమణ్యం, సుబ్బారావు, కాశీనాథ్, ప్రసాద్, రోజా, మంజుల, కవిత పాల్గొన్నారు.

ఠాను నాయక్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్టించాలి



ఠాను నాయక్‌కు నివాళులర్పిస్తున్న గిరిజన సంఘం నాయకులు

వనస్థలిపురం: తెలంగాణ సాయిధ పోరాట యోధుడు ఠానునాయక్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్టించాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మం నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఎల్‌బీనగర్ చౌరస్తా వద్ద తెలంగాణ గిరిజన సంఘం రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఠానునాయక్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మం నాయక్ మాట్లాడుతూ... పీడిత ప్రజల విముక్తి కోసం నిజాం రజాకార్ల దోపిడీకి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తుపాకీ చేతబట్టి గిరిజన తండాలా విముక్తికై పోరాడి నేలకొరిగిన లంబాడీ గిరిజన వీరుడు ఠానునాయక్ అని కొనియాడారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మూడావత్ గోపీనాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.బాలూనాయక్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆర్.శేఖర్‌నాయక్, జిల్లా కార్యదర్శి రమావత్ పాండునాయక్, నేతలు శ్రీను నాయక్, రాములు నాయక్, పంతునాయక్, సైదానాయక్, దాస్యానాయక్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



వయోవృద్ధుల సహాయ వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

చాదర్‌ఘాట్: దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమశాఖ కార్యాలయ ఆవరణలో జరిగిన క్యాల్‌కామ్, నిర్మాణ్ సంస్థల ఆధ్వర్యంలో వయో వృద్ధులకు సహాయ వాహనాలు, సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ... రూ. 1.80 కోట్ల వ్యయంతో సహాయ వాహనాలను సమకూర్చడం అభినందనీయమన్నారు. వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ... 76 స్మార్ట్ ఫోన్‌లు, 56 బ్యాటరీ మోటరైజ్‌డ్ వాహనాలు రూ. 45 లక్షలతో దివ్యాంగులకు అందజేశామన్నారు. దివ్యాంగుల స్పెషల్ సెక్రటరీ భారతి హోలికేరి మాట్లాడుతూ... మానవ విలువలు తగ్గి దివ్యాంగులను దూరం చేస్తున్నారని అది జరగకుండా అందరూ బాధ్యత తీసుకోవాలన్నారు. ఎండీ శైలజ మాట్లాడుతూ... హాస్టల్‌లో చదువుతున్న ప్రతి విద్యార్థికి స్మార్ట్‌ఫోన్‌లు అందజేస్తామన్నారు. అనంతరం హెల్ప్‌లైన్, పీడబ్ల్యూడీ, సీనియర్ సిటిజన్ కార్యాలయాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు. కార్పొరేషన్ జీఎం ప్రభంజన్‌రావు, ఏడీ రాజేందర్, రాజగోపాల్, క్యాల్‌కామ్ సీఈఓ నితిన్ శర్మ, నిర్మాణ్ సంస్థ సీఈఓ మయూర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ఆర్వో ప్లాంట్ వితరణ

ఎల్‌బీనగర్: తన పుట్టిన రోజు సందర్భంగా బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో సాహెబ్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను సామాజిక కార్యకర్త వింజమూరి శ్రవణ్‌కుమార్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు తాగు నీటి సౌకర్యంలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో సుమారు రూ. 1.50 లక్షల వ్యయంతో ఆర్వో మినరల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయించామన్నారు. కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మాట్లాడుతూ... పుట్టిన రోజున ఆర్వో మినరల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడంపై శ్రవణ్‌కుమార్‌రెడ్డిని అభినందించారు. తాను కూడా త్వరలో హైస్కూల్ విద్యార్థులకు స్వచ్ఛమైన తాగు అందించేందుకు మరో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఏపీబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పల్లపు రాము, త్రినేత్ర హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు ముద్దగౌని సుమన్‌గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లీలారాణి, రాధాకృష్ణ, రాజిరెడ్డి, జగన్‌మోహన్, రఘురాంనేత, నర్సింహారెడ్డి, సంతోష్‌రెడ్డి, శంకరయ్య, సందీప్‌రెడ్డి, కుర్మారావు, శ్రీధర్‌రావు, పవన్‌రెడ్డి, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఆస్తి పన్ను చెల్లించిన వ్యాపార సంఘం

చంచల్‌గూడ: మాదన్నపేట కూరగాయల మార్కెట్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్నును జీహెచ్‌ఎంసీకి చెల్లించినట్లు ఆకు కూరల, కూరగాయల విక్రయదారులు, రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి. రామేష్, ప్రధాన కార్యదర్శి సుమన్ తెలిపారు. తమ వంతు బాధ్యతగా సంఘం తరపున రూ. 2 లక్షల చెక్కును ఏఎంసీ మోహన్‌రెడ్డికి అందజేశామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సుధాకర్, యాదమ్మ, వాణి, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



ఏఎంసీ మోహన్‌రెడ్డికి చెక్కు అందజేస్తున్న వ్యాపారులు

ఈటలకు జన్మదిన శుభాకాంక్షలు



ఈటలకు శుభాకాంక్షలు చెబుతున్న కార్పొరేటర్లు నర్సింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి

మన్సూరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నేత, బీజేపీ నాయకుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి సోమవారం ఆయన నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, శ్యాంసుందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

'లీకేజీ'లపై చైతన్యపురిలో బీజేపీ నిరసన



చైతన్యపురి దీక్షలో పాల్గొన్న సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు

చైతన్యపురి: టీఎస్‌పీఎస్‌సీ పరీక్షా పత్రాల లీకేజీ ఘటనపై సిట్టింగ్ జడ్జిచే విచారణ చేయించాలని, పరీక్ష రాసిన నిరుద్యోగులకు ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు చైతన్యపురి డివిజన్ శివాజీ చౌక్ వద్ద సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సామ మాట్లాడుతూ... ఆత్మబలిదానాలతో సాధించుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ అసమర్థ పాలన వల్ల యువత దిక్కుతోచని స్థితిలో ఉందన్నారు. లీకేజీలకు బాధ్యత వహిస్తూ మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్లు రంగా నర్సింహగుప్తా, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, పవన్‌కుమార్, చింతల అరుణ సురేందర్‌యాదవ్, రాధా ధీరజ్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి నాయకులు రుద్రారపు శంకర్, ఉపేందర్‌రెడ్డి, వినోద్ యాదవ్, జయప్రకాష్, పసుపుల హరిబాబు, వేణుగోపాల్‌చారి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: టీఎస్ పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ నేపథ్యంలో మంత్రి కేటీఆర్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని బీజేపీ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ రాధా ధీరజ్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆర్‌కేపురం డివిజన్ కొత్తపేట చౌరస్తాలో నిరుద్యోగులకు మద్దతుగా పేపర్ లీకేజీ ఘటనపై మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయనందుకు నిరసనగా ముఖ్య మంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా రాధా ధీరజ్‌రెడ్డి మాట్లాడుతూ... టీఎస్ పీఎస్సీ ప్రశ్నపత్రాలు లీకేజీలో పరీక్షలను రద్దు చేయడం కాదని, కేసీఆర్ ప్రభుత్వాన్నే రద్దు చేయాలన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్ట ఉపేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రాములు యాదవ్, ప్రధాన కార్యదర్శులు, బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.